## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం 600 అడుగులకు మించొద్దు

కలెక్టరేట్, మే 2: ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారులు 600 అడుగుల్లోపే ఇంటి నిర్మాణం చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈమేరకు శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక జాబితాలు పూర్తయిన మేరకు ఎప్పటికప్పుడు ఇన్‌చార్జి మంత్రుల నుంచి ఆమోదం తీసుకోవాలని స్పష్టం చేశారు. అనర్హులకు పథకంలో చోటు లభిస్తే వారి నిర్మాణాలు మధ్యలో ఉన్నా రద్దు చేస్తామని వెల్లడించారు. జాబితాలతో సంబంధం లేకుండా నిరుపేదలను మాత్రమే ఎంపిక చేయాలన్నారు. పైలట్ మండలాల్లోని దరఖాస్తులు ఈనెల 31లోగా పరిష్కరించాలన్నారు. అలాగే ఈనెల 4న నిర్వహించనున్న నీట్ ప్రవేశ పరీక్షకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, భూభారతిపై అన్ని మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల్లో ఇప్పటివరకు 10,568 దరఖాస్తులు విచారించినట్లు చెప్పారు. లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తున్నామని, ఈనెల 4న జిల్లాలో నిర్వహించే నీట్ పరీక్ష కోసం జిల్లాలో ఏడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 2,975 మంది పరీక్ష రాయబోతున్నట్లు పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మికిరణ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, డీఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో కె.మహేశ్వర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## క్రీడలతో నాయకత్వ లక్షణాలు

మాట్లాడుతున్న హుజూరాబాద్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి పీబీ కిరణ్ కుమార్

హుజూరాబాద్ టౌన్, మే 2: పిల్లల్లో క్రీడలు నాయకత్వ లక్షణాలు పెంచుతాయని హుజూరాబాద్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి పీబీ కిరణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో స్వచ్ఛ హుజూరాబాద్ కార్యక్రమంలో భాగంగా హుజూరాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పిల్లలకు ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ సందర్భంగా హాజరైన న్యాయమూర్తి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను వేసవి సెలవుల్లో వృథాగా గడపకుండా క్రీడా శిబిరంలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే సమ్మయ్య, ఎంఈవో శ్రీనివాస్, హాకీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్, సామాజిక కార్యకర్త వర్ధినేని రవీందర్ రావు, హుజూరాబాద్ హాకీ క్లబ్ అధ్యక్షుడు తోట రాజేంద్ర ప్రసాద్, హాకీ క్లబ్ మాజీ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సొల్లు సారయ్య, సలహాదారు కొన్ని రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ భద్రతపై అవగాహన

ముకరంపుర, మే 2: అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది వినియోగదారులకు విద్యుత్ భద్రతపై అవగాహన కల్పించాలని కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ మేక రమేశ్ బాబు పేర్కొన్నారు. సర్కిల్ కార్యాలయ మీటింగ్ హాల్లో శుక్రవారం విద్యుత్ భద్రతపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ భద్రత వారోత్సవాలపై అవగాహన కల్పించేలా ముద్రించిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో డీఈలు ఉపేందర్, రాజం, ఏడీఈలు పంజాల శ్రీనివాస్ గౌడ్, టౌన్-1, 3, 5, 8 ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్డీవోకు బొమ్మనపల్లి గ్రామస్తుల వినతి

చిగురుమామిడి, మే 2: బొమ్మనపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వ భూమి కేటాయించాలని గ్రామస్తులు శుక్రవారం ఆర్డీవో మహేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం తహసీల్దార్‌ను కలిసి ప్రభుత్వ భూమి వివరాలను తెలిపారు. తహసీల్దార్ కలిసిన వారిలో మాజీ ఎంపీటీసీలు మిట్టపల్లి మల్లేశం, కత్తుల రమేశ్ తదితరులున్నారు.

# పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి

- భవిష్యత్తులో ఉన్నతంగా రాణించాలి
- విద్యార్థులకు కలెక్టర్ పమేలా సత్పతి సూచన

రామడుగు: వెదిర అల్ఫోర్స్‌లో నిర్వహించిన ఒలింపియాడ్ బహుమతుల ప్రదానోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి

రామడుగు, మే 2 : విద్యార్థి దశ నుంచే పోటీతత్వాన్ని పెంపొందించుకొని, ఆయా సంస్థలు నిర్వహిస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నతంగా రాణించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. రామడుగు మండలం వెదిర అల్ఫోర్స్ హైస్కూల్‌లో జిల్లా విద్యాశాఖ, అల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో చేపట్టిన రెండోదశ ఒలింపియాడ్ పరీక్షల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9వ తరగతి విద్యార్థులకు అల్ఫోర్స్ విద్యాసంస్థల సౌజన్యంతో ఒలింపియాడ్ నిర్వహించడం హర్షణీయమన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా.వి.నరేందర్‌రెడ్డిని అభినందించారు. అనంతరం ఒలింపియాడ్ పరీక్షలో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, ఒలింపియాడ్ సమన్వయకర్తలు అశోక్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

### వేసవి శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

కమాన్‌చౌరస్తా, మే 2 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. సీతారాంపూర్‌లోని ఐవీవై పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంపును శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఐవీవై పాఠశాల సహకారంతో 40 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 30 రోజుల పాటు కంప్యూటర్ అప్లికేషన్స్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, ఐవీవై స్కూల్ చైర్మన్ పసుల మహేశ్, కో చైర్మన్ శ్రీపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## ‘దోస్త్’ నోటిఫికేషన్ విడుదల

కమాన్‌చౌరస్తా, మే 2: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డిగ్రీ కాలేజీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి వివిధ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి దోస్త్ 2025 నోటిఫికేషన్‌ను ఉన్నత విద్యామండలి శుక్రవారం విడుదల చేసింది. ఈ నెల 3నుంచి 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రూ. 200 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ నెల 10 నుంచి 22వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. మే 29న ఫస్ట్ ఫేజ్ సీట్ల అలాట్ మెంట్ జరుగనున్నది. ఫస్ట్ ఫేజ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు మే 30 నుంచి జూన్ 6వ తేదీలోగా ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. సెకండ్ ఫేజ్ దరఖాస్తుల ప్రక్రియ మే 30 నుంచి జూన్ 8 వరకు కొనసాగనున్నది. సెకండ్ ఫేజ్‌లో కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకునే వారు రూ. 400 చెల్లించాల్సి ఉంటుంది. మే 30 నుంచి జూన్ 9 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. జూన్ 13న రెండో దశ సీట్లు కేటాయించనున్నారు. జూన్ 13 నుంచి 18వ తేదీ లోగా ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. థర్డ్ ఫేజ్ దరఖాస్తుల ప్రక్రియ జూన్ 13 నుంచి 19వ తేదీ వరకు కొనసాగనున్నది. రిజిస్ట్రేషన్‌కు రూ. 400 చెల్లించాలి. జూన్ 13 నుంచి 19 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. జూన్ 23న సీట్ల కేటాయింపు జరుగనున్నది. జూన్ 23 నుంచి 28 వరకు కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్‌కు అవకాశం కల్పించారు. జూన్ 30 నుంచి డిగ్రీ ఫస్టియర్ తరగతులు ప్రారంభం కానున్నాయి.

## అంగన్‌వాడీ పిల్లలకు వేసవి సెలవులు

కలెక్టరేట్, మే 2 : అంగన్‌వాడీ సెంటర్లలో ప్రీస్కూల్ విద్యసభ్యసిస్తున్న పిల్లలకు వేసవి సెలవులు ప్రకటించారు. ఈమేరకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతివెస్లీ శుక్రవారం సర్కులర్ జారీ చేసినట్లు, జిల్లా సంక్షేమాధికారి ఎం.సరస్వతి తెలిపారు. ఈనెల 31వరకు చిన్నారులకు సెలవులు ప్రకటించగా, కేంద్రాల్లో పనిచేసే టీచర్లకు మొదటి 15రోజులు, అనంతరం రెండో పక్షంలో ఆయాలు సెలవులు తీసుకోవాలని పేర్కొన్నారు. పౌష్టికాహారం ఇళ్లకు అందజేయాలని, ఇతర సమయంలో సీడీపీవోలు, సూపర్‌వైజర్ల సూచనల మేరకు వార్షిక సర్వే, ఇంటింటి సందర్శన, ప్రీస్కూళ్లలో చిన్నారులను చేర్చుట, డ్రాపౌట్లను గుర్తించి వారికి తిరిగి ప్రవేశాలు కల్పించడం లాంటి దైనందిన కార్యక్రమాలు నిర్వహించాలని సర్కులర్‌లో తెలిపినట్లు, శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, ఆయాలు లేనిచోట టీచర్లు సెలవులు తీసుకోకుండా విధులు నిర్వహించాల్సి ఉంటుందని వెల్లడించారు.

## ‘మెడికవర్’ ఉచిత వైద్య శిబిరం

పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

విద్యానగర్, మే 2 : కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ రేకుర్తి రోడ్డులోని వరుణ్ మోటార్స్ షోరూంలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది, కస్టమర్లకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని షోరూం మేనేజర్ ప్రవీణ్, కార్తీక్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 110 మందికి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రావికంటి నాగరాజు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ.. తమ హాస్పిటల్‌లో 24 గంటల పాటు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. శిబిరంలో హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ‘మెమో ఇప్పించండి..’

కమాన్‌చౌరస్తా, మే 2 : తాను కళాశాల ప్రవేశం అప్పుడు, కళాశాలకు అప్పగించిన మెమో తనకు ఇప్పించాలని ఎస్సారార్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థిని అఖిల కళాశాల అధికారులకు మెరపెట్టుకుంది. తాను 2020లో కళాశాల డిగ్రీలో ప్రవేశంతో పాటు ఎన్సీసీలో చేరానని, అప్పుడు తన వద్ద తీసుకున్న పదో తరగతి మెమో, ఇతర ధ్రువీకరణ పత్రాలు అప్పటి ఎన్సీసీ అధికారులు తీసుకున్నారని చెప్పింది. వాటి తిరిగి తీసుకుందామని కళాశాలకు రాగా, అవి తమ వద్ద లేవని, సమాధానం చెప్పారని తెలిపింది. కళాశాల అధికారులే తనకు సర్టిఫికెట్లు ఇప్పించాలని కోరింది. ఈ విషయంపై ప్రిన్సిపాల్ కె. రామకృష్ణను వివరణ కోరగా, విద్యార్థిని సర్టిఫికెట్లు ఎవరికి ఇచ్చారో తెలియదని, అయినా కళాశాలలో పరిశీలిస్తామని చెప్పారు. సర్టిఫికెట్లు దొరికేవరకు విద్యార్థికి తమ సహకారం ఉంటుందని వివరించారు.

## బీజేపీ పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదు

మాట్లాడుతున్న సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి

చిగురుమామిడి, మే 2 : కేంద్రంలోని బీజేపీ కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్నదని, 11 ఏళ్ల ఆ పార్టీ పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని సీపీఐ జాతీయ నేత చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రానికి రావలసిన నిధులను ఇవ్వడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందన్నారు. విభజన హామీలను తుంగలో తొక్కి రాష్ట్రాల హక్కులను కాల రాస్తున్నదన్నారు. చిగురుమామిడి మండల కేంద్రంలో సీపీఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సభకు చాడ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కమ్యూనిస్టులు మతోన్మాద బీజేపీ విధానాలు ఎండగట్టేందుకు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చి ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు. తన స్వగ్రామం రేకొండలో ఉండి పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ, ఈనెల 27, 28 తేదీల్లో జిల్లా కేంద్రంలో సీపీఐ జిల్లా మహాసభలను నిర్వహిస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొన్నగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు అందే స్వామి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, కౌన్సిల్ సభ్యులు చాడ శ్రీధర్ రెడ్డి, బూడిద సదాశివ, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మీరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలకు కాంగ్రెస్‌దే బాధ్యత

కేశవపట్నం బస్టాండ్‌లో కరపత్రం విడుదల చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

శంకరపట్నం, మే 2: ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలకు కాంగ్రెస్ పార్టీ బాధ్యత వహించాలని పలువురు ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఈనెల 27న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'ఆటో ఆకలి కేకలు మహాసభ' కరపత్రాలను శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు కల్పిస్తున్న ఉచిత ప్రయాణంతో ఆటో డ్రైవర్లకు ఉపాధి కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాలను పోషించలేక దిక్కు తోచని స్థితిలో పలువురు ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను వెంటనే అమలుపరచాలని డిమాండ్ చేస్తూ నర్సాపూర్-హైదరాబాద్ వరకు రాష్ట్రవ్యాప్త 'ఆటో రథయాత్ర' చేపట్టినట్లు తెలిపారు. చివరి రోజు మే 27న ఇందిరాపార్కులో మహాసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్క ఆటో యూనియన్ కార్మికుడు ఈ సభ విజయవంతం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆటో ర్యాలీగా కేశవపట్నం ఆర్టీసీ బస్టాండ్ నుంచి హుజూరాబాద్ వరకు తరలి వెళ్లారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులతో పాటు మండల నాయకులు గుర్రం శ్రీనివాస్, వాజిద్, కిషోర్, చారి, శివానందం, మజ్జా, సంపత్, ఓదెలు, తదితరులు పాల్గొన్నారు.

## ‘కాంగ్రెస్ అనుచరులకే ఇందిరమ్మ ఇండ్లు’

శంకరపట్నం, మే 2: కాంగ్రెస్ పార్టీ అనుచరులకే ఇందిరమ్మ ఇండ్ల పథకంలో చోటు కల్పిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బోయిని అశోక్ ప్రభుత్వాన్ని విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలో సీపీఐ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ కమిటీల పేరుతో కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఎంపికల్లో నిజమైన అర్హులకు అన్యాయం జరుగుతున్నదని మండిపడ్డారు. అర్హులను పక్కన పెట్టి కాంగ్రెస్ పార్టీ వారికి ఎంపిక జాబితాలలో చోటు కల్పిస్తున్నారని దుయ్యబట్టారు. అధికారులు సైతం అవే జాబితాలను ఎంపిక చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడడం గర్హనీయం అన్నారు. ఇప్పటికైనా నిజమైన పేదలకు న్యాయం జరిగేలా చూడాలని లేదా తమ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. ఇక్కడ సీపీఐ నాయకులు కన్నం సదానందం, గోదరి లక్ష్మణ్, బొజ్జ సదానందం పాల్గొన్నారు.

## జమ్మికుంట మున్సిపాలిటీకి అరుదైన గౌరవం

మున్సిపల్ సెక్రటరీకి మొక్క అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

జమ్మికుంట, మే 2: ఆస్తి పన్ను వసూళ్లలో 100 శాతం, 5 శాతం రిబేట్‌లో మొదటి స్థానం సాధించినందుకు జమ్మికుంట మున్సిపాలిటీకి అరుదైన గౌరవం దక్కింది. జమ్మికుంట మున్సిపాలిటీ తెలంగాణ రాష్ట్రంలో ఆస్తిపన్ను వసూళ్లలో మొదటి స్థానం సాధించిన సందర్భంగా శుక్రవారం మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఆయాజ్‌తో పాటు సిబ్బంది మున్సిపల్ సెక్రటరీ కె.శ్రీదేవి హైదరాబాద్‌కు పిలిపించుకొని, మున్సిపాలిటీకి రూ.3 కోట్ల నిధుల ప్రోసీడింగ్ అందజేశారు. కమిషనర్‌తోపాటు మున్సిపల్ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి.రాజిరెడ్డి, ఆర్ఐ భాస్కర్, ఆర్వో వాణి, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సమష్టి కృషితో హక్కులను సాధించుకోవాలి

తెలంగాణచౌక్, మే 2: సమష్టి కృషితోనే హక్కులను సాధించుకోవాలని తెలంగాణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం మొండయ్య పిలుపునిచ్చారు. నగరంలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సంఘంలో సమాచారంలోపం లేకుండా సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ట్రేడ్ లైసెన్స్ నుంచి నాయీబ్రాహ్మణులకు మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నాయీబ్రాహ్మణ వృత్తి సేవా దృక్పథంతో చేసే వృత్తి అని, వ్యాపార లావాదేవీలు ఉండవని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమ వృత్తి సమస్యలను గుర్తించి ట్రేడ్ లైసెన్స్ నుంచి మినహాయింపు ఇవ్వడమేకాకుండా ప్రతి నెలా 250 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని వర్తింపజేసిందని గుర్తు చేశారు. నూతన క్షౌరశాలలకు కూడా ఉచిత విద్యుత్ పథకాన్ని వర్తింప చేయాలని అధికారులను కోరారు. రాజీవ్ యువ వికాసం పథకంలో నాయీబ్రాహ్మణులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల సంపత్. నాయకులు వెంకటేశ్. సదానందం పాల్గొన్నారు.

## కుంట బుడుగులో చిక్కుకుని మత్స్యకారుడి మృతి

శంకరపట్నం, మే 2: చేపలు పట్టేందుకు వెళ్లిన మత్స్యకారుడు బుడుగులో చిక్కుకుని మృతి చెందిన విషాదకర ఘటన మెట్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మెట్‌పల్లి గ్రామంలో మత్స్యకార కుటుంబానికి చెందిన దంపతులు కొల్లూరి చంద్రమౌళి-సరమ్మ శుక్రవారం మధ్యాహ్నం గ్రామ శివారులోని చింతకుంటలోకి చేపలు పట్టేందుకు వెళ్లారు. చంద్రమౌళి కుంటలోకి దిగగా భార్య సరమ్మ గట్టున కూర్చుంది. కుంటలోకి దిగిన చంద్రమౌళి బుడుగులో కూరుకుపోయి బయటకు రాలేక ఇబ్బంది పడడం చూసిన సరమ్మ వెంటనే కేకలు వేయగా, సమీపంలో ఉన్న ఓ వ్యక్తి రాగా చీర వేసి బయటకు లాగే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే బుడుగులో చిక్కుకొని నీట మునిగి ఊపిరి ఆడక మృతి చెందాడు. చంద్రమౌళి (60)కి వివాహమైన కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న కేశవపట్నం ఎస్ఐ సిబ్బందితో కుంట వద్దకు వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలిస్తున్నట్లు తెలిపారు.

## భీమ్ ఆర్మీ జిల్లా స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, మే 2: నగరంలో ఈనెల 4న నిర్వహిస్తున్న భీమ్ ఆర్మీ జిల్లా స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినిపల్లి చంద్రయ్య కోరారు. కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ఉదయం 10 గంటలకు ప్రారంభకానున్న సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకుల సమక్షంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గంగాధర, మే 2 : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 72 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.21 లక్షల 16 వేల 500 ఆర్థిక సాయం మంజూరైంది. శుక్రవారం మండలంలోని మధురానగర్‌లో గంగాధర మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజితాశ్రీనివాస్‌రెడ్డి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

## డీఐఈవోగా గంగాధర్

గంగాధర్

కమాన్‌చౌరస్తా, మే 2: కరీంనగర్ జిల్లా నూతన ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారిగా జమ్మికుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న వీ గంగాధర్ శుక్రవారం నియమితులయ్యారు. గతంలో డీఐఈవోగా విధులు నిర్వహించిన జగన్ మోహన్ రెడ్డి ఏప్రిల్ 30న ఉద్యోగ విరమణ పొందగా, గంగాధర్‌కు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది.

## సేవాభావం అభినందనీయం

వీణవంక, మే 2: తోటివారికి సేవ చేయాలన్న మంచి గుణం కలిగి ఉండడం అభినందనీయమని చల్లూరు మాజీ సర్పంచ్ పొదిల జ్యోతి-రమేశ్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు అన్నారు. చల్లూరు గ్రామానికి చెందిన ఏఎం ఎలక్ట్రికల్స్ (నసీరొద్దీన్) ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రయాణికులు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చలివేంద్రం నిర్వాహకులు నసీరొద్దీన్, నాయకులు అఖిల్, అజాంపాషా, ఎల్కపెల్లి లక్ష్మణ్, మధుసూదన్, జామా మసీద్, కుబా మసీద్, సదర్లు, ఇమామ్‌లు, సోహెల్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## కరాటేతో ఆత్మవిశ్వాసం

శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, ఎక్సైజ్ ఎస్ఐ వినోద్, తదితరులు

హుజూరాబాద్ టౌన్, మే 2: గ్లోబల్ షోటో కాన్ కరాటే డో ఇండియా కరీంనగర్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని న్యూ కాకతీయ మోడల్ స్కూల్‌లో వేసవి ప్రత్యేక కరాటే శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్కే జలీల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య హాజరై మాట్లాడారు. కరాటే నేర్చుకోవడం వల్ల పిల్లలకు ఆత్మవిశ్వాసం పెరిగి విద్యలో రాణిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై వినోద్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మేకల తిరుపతి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఖాళీద్ హుస్సేన్, ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు సమ్మయ్య, బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ లక్ష్మణ మూర్తి, సబ్బని వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధుడి బలవన్మరణం

మానకొండూర్, మే 2: మండలంలోని పోచంపల్లి గ్రామానికి పాలం పోచాలు (76) జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని బలవన్మరణం చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచాలు కొంత కాలంగా కడుపునొప్పి, ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. ఎన్ని దవాఖానలు తిరిగినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించారు. పోచాలుకు భార్య తోపాటు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు.

## చేనేత హస్తకళా ప్రదర్శన ప్రారంభం

విద్యానగర్, మే 2: కలెక్ట